

హోమియో...

డైలీ హెల్త్ డైరీ

# చర్మం పొలుసుల్లా ఊడుతుంటే...?

నాకు 70ఏళ్లు. గత ఐదేళ్ళుగా నా భుజాలు, ఛాతీపై కంది బద్ద అంత ఎర్రగా పులిపిర్లు ఏర్పడ్డాయి. ఇప్పుడిప్పుడే చేతులపై కూడా వస్తున్నాయి. వీటి వల్ల ఎటువంటి అసౌకర్యం లేదు కాని ఇవి పెరగకుండా చేయాలంటే ఏం చేయాలో తెలియజేయండి.

– ఎస్.మోహన్‌రావు, బాపట్ల

మీ భుజాలపైన, ఛాతిపైన ఏర్పడిన ఎర్రటి పులిపిర్లను చెర్రీరెడ్ ఆంజియోమా లేదా సెనైల్ ఆంజియోమా అంటారు.

**చెర్రీ రెడ్ ఆంజియోమా:** పులిపిర్లలానే ఎర్రటి రంగులో ఏర్పడి, పెరుగుదలలో సన్నటి రక్తనాళాలు చర్మంపైకి చొచ్చుకుని వచ్చి మెత్తని ముద్దల్లా మారతాయి. ఇవి సాధారణంగా 40ఏళ్ళు దాటిన వారిలో మొదలవుతాయి. పెద్ద వయసు ఉన్న వారిలో ఎక్కువగా కనబడుతుంటాయి. అందుకే వీటిని సెనైల్ (వృద్ధులలో) ఆంజియోమా అంటారు. ఇవి ఏమాత్రం హాని చేయని ట్యూమర్‌లు. ఇవి రావడం వల్ల నొప్పి, దురద వంటివి సాధారణంగా ఉండవు. కాని దానిని తీసేయాలని గిల్లడం వల్ల ఎక్కువగా రక్తం కారవచ్చు. కాబట్టి వాటిని తీసేయడానికి ప్రయత్నించకండి. 70ఏళ్ళు దాటిన దాదాపు 70శాతం మందిలో ఇవి ముఖం, తల, మెడ, చేతులు, కాళ్ళు... ఇలా ఎక్కడైనా కనబడతాయి. ఇవి రావడానికి ప్రత్యేకమైన కారణాలు కూడా ఏమీ లేవనే చెప్పవచ్చు. ఇలా సరైన కారణాలు లేకుండా ఉండే సమస్యలను హోమియోలో కాన్‌స్టిట్యూషనల్ చికిత్స ద్వారా నయం చేయొచ్చు.

మీరు పదిహేను రోజులకొకసారి బెల్లడోన్నా 1ఎమ్ ఒక డోసు, మూడురోజులకొకసారి తూజా 30 ఒక డోసు వేసుకుంటే తప్పకుండా ఫలితం ఉంటుంది.

నాకు 23ఏళ్ళు. తరచుగా నా అరచేతులు, వేళ్ళ మధ్య ఉండే చర్మం పొలుసులా ఊడిపోతోంది, ఎండాకాలంలో అయితే అరచేతులు అరికాళ్ళల్లో ఎక్కువగా చెమట పడుతుంటుంది. అలాగే అంగం చివర వృషణాల పైన ఉండే చర్మం కూడా పొలుసుగా ఊడిపోతోంది. ఈ సమస్య మాత్రం కేవలం వేసవిలోనే ఉంటుంది, నాకు ఎలాంటి సుఖ వ్యాధి లేదు. దయచేసి నా సమస్యలకు పరిష్కారం సూచించండి.

– కుమార్, కర్నూలు జిల్లా

చాలా రకాల చర్మ వ్యాధులలో చర్మం పొలుసులుగా ఊడిపోతుంటుంది. సోరియాసిస్, కాన్‌టాక్ట్ డెర్మటైటిస్, సిబోరిక్ కెరటోసిస్, డిస్‌హైడ్రోసిస్, సిబోరిక్ ఎగ్జిమా, డ్రై స్కిన్ స్టాసిస్ డర్మటైటిస్ వంటి వ్యాధుల్లో ఈ లక్షణం కనబడుతుంది.

మీకు ఎండాకాలంలో ఎక్కువగా చెమట పట్టడం వల్ల సమస్య ఎక్కువ అవుతుంది కాబట్టి మీకు డిస్‌హైడ్రోసిస్ లేదా సిబోరిక్ ఎగ్జిమా అయ్యి ఉంటుంది. దీనినే వాడుక భాషలో గజ్జి అంటారు.

**సిబోరిక్ డెర్మటైటిస్:** ఇన్‌ఫ్లమేషన్ వల్ల చర్మం తెల్లగా లేదా పసుపు రంగులో పొలుసులుగా ఊడిపోతుంటుంది. చెమట ఎక్కువగా పట్టే తలపైన, చెవి లోపల, వేళ్ళ మధ్యలో, చంకలు, గజ్జల్లో, వృషణాలు మొదలైన ప్రదేశాల్లో చర్మం ఎర్రగా మారుతుంటుంది.

**కారణాలు:**

ఎక్కువగా చెమట పట్టడం, పెరుగు వల్ల ఇరిటేషన్‌రావడం, వంశపారంపర్యంగా, మానసిక ఒత్తిడి, వాతావరణంలో మార్పులు, జిడ్డు చర్మం, షాంపూలు-సబ్బులు వంటివి తరుచుగా మార్చడం, ఆల్కహాల్ ఎక్కువగా ఉండే లోషన్లు ఉపయోగించడం, నాడీ సంబంధిత వ్యాధులు, ఎక్కువ బరువు ఉండటం వంటివి ఈ సమస్యకు కారణాలు అయ్యిండొచ్చు.

**లక్షణాలు:** చెమట ఎక్కువగా పట్టే ప్రదేశాల్లో దురద, మంట, చర్మం పొలుసులుగా ఊడిపోవడం, తలలో చుండ్రు, చర్మం ఎర్రబడటం, వెంట్రుకలు రాలడం వంటి లక్షణాలు కనబడతాయి.

ఎండాకాలంలోనే చెమట ఎక్కువగా పడుతుంది కాబట్టి ఈ లక్షణాలు ఎండాకాలంలోనే ఎక్కువగా కనబడుతుంటాయి.

హోమియో వైద్యంలో ఈ సమస్యకు చాలా మందులున్నాయి. గ్రాఫైటిస్, ఆర్సెనిక్, హెపర్ సల్ఫర్, సల్ఫర్, రస్టాక్స్, బెరిబెరిన్, హైడ్రాస్టిన్, సైలీసియా, నేట్రమ్ మూర్ మందులు ఈ సమస్యను నివారిస్తాయి.

మీరు మీ సమస్యకు నేట్రమ్ మూర్ 200 పొటెన్సీలో వారానికి ఒక డోసు చొప్పున రెండు వారాలు వాడి తర్వాత మూడు రోజులకు ఒక డోసు గ్రాఫైటిస్ 30 పొటెన్సీలో వాడండి. సమస్య తగ్గాలంటే శుభ్రత పాటించడం చాలా ముఖ్యం. కాబట్టి ఎండాకాలంలో రోజుకు రెండుసార్లు స్నానం చేయండి, లోదుస్తులు తడిగా లేకుండా చూసుకోవాలి.





డాక్టర్ రాజశేఖర్,
ష్యూర్‌కేర్ హోమియోపతి

## హోమియో ట్రివియా

### పాసిఫ్లోరా ఇన్‌కరాంటా

పాసీఫ్లోరా చెట్టు చూడటానికి చాలా ఆకర్షణీయంగా ఉండే ఒక తీగ. ఈ తీగ టెండ్రిల్స్ అనే స్ప్రింగ్ లాంటి తీగల ఆధారంతో ఒక ఆధారం నుంచి మరో ఆధారానికి పాకుతూ పెరుగుతుంది. ఈ తీగలో అత్యంత ఆకర్షణీయమైనది పువ్వు. హోమియోలో ఈ మొక్క ద్వారా తయారయ్యే మందును 'యాంటీస్పాస్మాడిక్ రెమిడి' అంటారు. దీని మదర్



పాసిఫ్లోరా ఇన్‌కరాంటా పువ్వు

టించర్‌ను పడుకునే ముందు 8-10 చుక్కలు తీసుకుంటే మెదడులో అవకతవకలు, మానసిక ఒత్తిడి, చిన్న పిల్లల్లో జర్వం, ఫిట్స్, కడుపులో పురుగులు ఇలాంటి ఎన్నో సమస్యలు పరిష్కారమవుతాయి.

మీ సాధారణ ఆరోగ్య సమస్యలకు హోమియో చికిత్సా విధానంలో సలహాల కోసం రాయండి: మా చిరునామా: హోమియో కౌన్సెలింగ్,
సాక్షి ఫ్యామిలీ, సాక్షి తెలుగు దినపత్రిక, 6-2-249/1,
సాక్షి టవర్స్, రోడ్ నంబర్-1, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
ఇ-మెయిల్: health@sakshi.com
(గమనిక: మెయిల్‌లో పంపేవారు సబ్జెక్ట్‌లో homeo అని రాయండి)